7 నుంచే 'టోఫెల్'కి సిద్ధం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి కార్యక్రమం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణం శాఖ మంత్రి జోగి రమేష్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, మెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలను జిల్లాకు అందించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, తమ వంతు కృషి చేసిన ఉపాధ్యాయులకు మంత్రి అభినందనలు తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఉత్తమ ఆలోచన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం అన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పాదయాత్రలో ఆనాటి విద్యా పరిస్థితులు, పాఠశాలలలో పరిస్థితులు స్వయంగా చూసి విద్య వ్యవస్థను సమూలంగా మార్చి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపునకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించుటకు అమ్మబడి జగనన్న గోరుముద్ద జగనన్న విద్యా కానుక జగనన్న విద్యాధీన వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మన రాష్ట్ర విద్యార్థులు రాణించుటకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టారని అన్నారు. అమెరికా వెళ్లాలంటే జిఆర్ ఈ /టోఫెల్ పరీక్షలు రాయాల్సి ఉంటుందని అందువల్ల 7వ తరగతి నుండే టోఫెల్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేద్దామని ముఖ్యమంత్రి తనతో చెప్పారని అన్నారు. ఇవన్నీ చేస్తున్నది ఓట్ల కోసం కాదని, విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా ఒక్క నయా పైసా ఖర్చు లేకుండా ఎంతవరకైనా ఎన్ని లక్షలైనా చదివించుటకు ముఖ్యమంత్రి జగనన్న సిద్ధంగా ఉన్నారని, కావున విద్యార్థులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, తల్లిదండ్రులకు, జిల్లా పేరు ప్రతిష్టలు పెంచే విధంగా ఐఏఎస్ ఐపీఎస్ లకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. గత ఏడాది కంటే 10లో 2023 మార్చి ఫలితాలు 10 శాతం పెరిగాయని అలాగే 2024 మార్చిలో మరింత ఉత్తీర్ణత శాతం పెంచుటకు కృషి చేయాలని ఉపాధ్యాయు లకు సూచించారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించాలని ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నదని అన్నారు. వేల కోట్లు ప్రభుత్వం వ్యయంచేసి పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు డిజిటల్ తరగతులు ట్యాబ్స్ పంపిణీ విద్యా కానుక పంపిణీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నదని అన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడి ఫలితాలు బాగా వస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ /కార్పొరేట్ విద్యార్థులకు ఏమాత్రం తీసుపోమని ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రభుత్వం ఉత్తమ ప్రతిభ కనబరిచిన మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను గౌరవించడం కోసం జగనన్న ఆణిముత్యాలు అద్భుత ప్రోగ్రాం అని, ఇది గతంలో లేదని అన్నారు. గతంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో తమ పిల్లలు చదువుతున్నారని తల్లిదండ్రులు గర్వంగా భావించే వారిని, కానీ పరిస్థితులు మారాయని, ప్రభుత్వ పాఠశాలల్లో సీటు కోసం పై స్థాయిలో సిఫార్సులు కోసం రిక్వెస్ట్ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని, ముఖ్యమంత్రి చక్కని విజన్ తో ఇది సాధ్యమైంది అన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు మీరే అంటూ విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, బాగా చదివి వృద్ధిలోకి రావాలన్నారు తల్లిదండ్రులను ఉపాధ్యాయులను మరువరాదని సూచించారు. నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలను ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారని పిల్లలు పనికి కాదు బడికి పంపాలని అమ్మ ఒడి అమలు చేస్తున్నారని అన్నారు. ముడా చైర్ పర్సన్ నాగలక్ష్మి దుర్గ భవాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుందన్నారు. తొలుత డీఈవో తహెరా సుల్తానా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం వివరాలు, విద్యాశాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు జడ్పీటీసీ సురేష్ రంగబాబు, కృత్తివెన్ను జడ్పీటీసీ ఎం. రత్నకుమారి, పెడన ఏఎంసీ చైర్ పర్సన్ చారుమతి,పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొనగా, అధికారులలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, ఒకేషనల్ విద్య అధికారి రాజేంద్రప్రసాద్, సర్వ శిక్ష ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ శేఖర్, డిటిడబ్ల్యుఓ పని దూర్జటి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఏ శ్రీనివాసరావు, ఉప విద్యాశాఖ అధికారి యు వి సుబ్బారావు ఎంఈఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో హైటెన్షన్

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గంలో సాగుతున్న మట్టి మాఫియా ఆగడాలను నిలువరించాలని కోరుతూ మాజీ ఉపసభాపతి మండల బుద్ధప్రసాద్ నిర్వహించతలపెట్టిన నాగాయలంక కార్యాలయ ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. నాగాయలంక రెవెన్యూ కార్యాలయం వద్ద రైతులతో శనివారం ఉదయం 10 గంటలకు ముట్టడి కార్యక్రమాన్ని శుక్రవారం నాగాయలంక పరిధిలోని భావదేవరపల్లిలో మట్టి తవ్వకాలను పరిశీలించి పిలుపునిచ్చారు. మండలి తన ఇంటి నుండి నాగాయలంక కార్యక్రమానికి బయలుదేరుతున్న సమయంలో పోలీసులు ఇంటి బయట అడ్డుకున్నారు. దీంతో కార్యకర్తలకు, పోలీసులకు నడుమ తోపులాట జరుగగా కార్యకర్తలు అడ్డగిస్తుండగానే బుద్ధప్రసాద్‌ను పోలీసులు వారి వాహనంలో ఎక్కించుకుని కోడూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యకర్తలు, రైతులు పోలీసుల వాహనాలకు అడ్డుగా బెటాయించారు. బెటాయించిన కార్యకర్తలను పోలీసులు తోసుకుంటూ వెళ్ళారు. మండలిని పోలీసులు అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది.

19న కలెక్టర్ కార్యాలయం వద్ద చేనేత కార్మికుల ధర్నా జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెడన : చేనేతల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 19న కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేనేతలు ఉపయోగించే నూలు, రంగులు, జరి, రేషన్‌తో పాటు చీరలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ ఎత్తివేయాలని సహకార సంఘాల ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం ఇవ్వాల్సిన యారన్ సబ్సిడీ, రిబేటు బకాయిలు, పావలా వడ్డీ, తృప్తి టు పండు, బకాయిలు వెంటనే విడుదల చేయాలని, నూలు, రంగులు, రేట్లు తగ్గించాలని చేనేత పరిశ్రమ ఆదుకోవాలని నేతన్న నేస్తం ఉపవృత్తిల వారికి కూడా అందించాలని కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత పరిశ్రమపై ఆధారపడిన ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని హేమ సుందరరావు విజ్ఞప్తి చేశారు.

పంటబోదులోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వానపాముల సమీపంలో విజయవాడ నుండి గుడివాడ వైపు వెళుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు అదుపు తప్పడంతో పక్కనే ఉన్న పంటబోదులోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో 68 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారని ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం సంభవించలేదని స్థానిక ఎస్ఐ పి.నాగకళ్యాణి శనివారం తెలిపారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేడు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-మచిలీపట్నం : మైత్రి ఫౌండేషన్ తరపున 100 మంది పేద విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర సామాగ్రి కొంతమందికి ముగ్గురికి 5 వేలు చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తారని, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి లోపం ఉన్న వారికి వినికిడి యంత్రం ఇప్పిస్తామని మైత్రి ఫౌండేషన్ అధ్యక్షులు కే వేణు కుమార్ అన్నారు. శనివారం స్థానిక బెల్ కంపెనీ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైత్రీ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవ వేడుకలు సందర్భంగా ఆదివారం సాయంత్రం 5-00 గంటలకు షార్క్ గర్ల్స్ హాస్టల్‌లో పంపిణీ చేస్తారన్నారు. పట్టణ ప్రజలు దాతలు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ కె వరప్రసాద్, డి. రాధాకృష్ణ, శ్రావణం శివ, బి.గంగయ్య, జి. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు ప్రజలకు ఎంతో సౌకర్యవంతం

విశాలాంధ్ర-మచిలీపట్నం : సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్లు ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ మచిలీపట్నం మండలంలోని పోతిరెడ్డి పాలెం సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న వివిధ రకాల రిజిస్ట్రేషన్ల వివరాలు జిల్లా కలెక్టర్ సంబంధిత సచివాలయ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా కంప్యూటర్లో ఐ.జీ.ఆర్.ఎస్. ఆన్లైన్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలించారు. వైయస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్షా పథకం కింద రూపొందించిన భూకమత పటాల పుస్తకం పరిశీలించారు. మండల తహసిల్దార్ సునీల్ బాబు జిల్లా కలెక్టర్ కు వివరిస్తూ పోతిరెడ్డిపాలెం సచివాలయ పరిధిలో పొట్లపాలెం, పోతిరెడ్డి పాలెం గ్రామాలు ఉన్నాయని, ప్రస్తుతం వెబ్ల్యాండ్ 1.0 లో ఫేస్ వన్ లో ఉన్నామని కొత్త వర్షన్ 2.0లోకి సాఫ్ట్వేర్ ఇంకా రావాల్సి ఉందని చెప్పారు. ఇప్పటివరకు సచివాలయం పరిధిలో పొట్లపాలెం రెవెన్యూ గ్రామానికి సంబంధించి మొదటి విడతలో రిజిస్ట్రేషన్ మొదలు పెట్టామని ,గత సంవత్సరం మే నెల నుండి ఇప్పటివరకు 46 రిజిస్ట్రేషన్లు చేశామని ఎవరైనా రిజిస్ట్రేషన్ కోసం వచ్చినప్పుడు అడంగల్, ఆర్.ఓ.ఆర్ సరిగా ఉన్నాయా లేదా పరిశీలించి డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ తో సరిపోల్చుకుని రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతోందని, కొత్తగా కొత్తపూడి రెవెన్యూ గ్రామానికి సంబంధించి రిజిస్ట్రేషన్ చేయడానికి అనుమతి వచ్చిందని పంచాయతీ కార్యదర్శి అంబటి దివ్య, డిజిటల్ సహాయకులు మహేష్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్ కోసం రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న సచివాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు అందుబాటులోకి తెచ్చిందన్నారు. తద్వారా ప్రజలకు ఎక్కడికక్కడ సమీపంలోనే రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించబడిందన్నారు. ఈనెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం పై సచివాలయ కార్యదర్శులు అందరికీ అవగాహన కలిగిస్తున్నామని, తహసిల్దార్లు ఎంపీడీవోలు వాలంటీర్లతో కలిసి ప్రజలకు అవసరమైన కులము, ఆదాయము, జనన తదితర ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రిజిస్ట్రార్ పివివి దుర్గాప్రసాద్, డి ఎల్ డి ఓలు సుబ్బారావు, పద్మ, ఎంపీడీవో బాలకృష్ణ రావు, సర్వేయరు రామకృష్ణ పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఓర్వలేక 'వర్ల'అనుచిత వ్యాఖ్యలు

విశాలాంధ్ర-పమిడిముక్కల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అలాగే నియోజకవర్గంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కి ప్రజాదరణ చూడలేక ఆయన పై తెలుగు దేశం పార్టీ నాయకుడు వర్ల కుమార రాజా అనుచిత వ్యాఖ్యలు చేయటం సమంజసం కాదని వాటిని ఖండిస్తున్నామని యంపిపి కాసాని వేద సుప్రజ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణాపురం లో రహదారులు అధ్వాన్నం గా వున్నాయని ఎమ్మెల్యే కైలే కాంట్రాక్టర్ ని 'కప్పం' కడితేనే పనులు ప్రారంభించాలన్నారని దానికి నిరసన కార్యక్రమం తెలుపుతున్నామని అనడం ఆయనకే చెల్లిందని ఈ లాంటి విషయాల్లో ఇష్టం వచ్చినట్టు మాట్లాడవద్దని హెచ్చరించారు.వైస్ యంపిపి కె.మహేష్ మాట్లాడుతూ గత తెదేపా హయాంలో చెట్టు-నీరు పథకం తో మట్టి ని దోచేశారని మా ఎమ్మెల్యే కైలే నియోజకవర్గం లో చేసిన అభివృద్ధి పనులు చూసి కన్నుకుట్టి ఏమి మాట్లాడాలో తెలియక మతి భ్రమించిందని మంటాడ నుంచి వీరంకిలాకు ,హనుమంతపురం గోపువానిపాలెం రహదారులు, గ్రామాల్లో అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం,కాగా ఎమ్మెల్యే కైలే ఆధ్వర్యంలో కృష్ణాపురం నుండి గౌడపాలెం రహదారి కి రూ.30లక్షల తో అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయని మాజీ యంపిపి యం.వి.సుబ్బయ్య కృష్ణాపురానికి చాలా అన్యాయం చేశారని పరసా జగన్ మోహన్ రావు అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ యంపిపి గంజాల సీతారామయ్య పి.చంద్రపాల్ బంద్రపల్లి శ్యామ్ వై.శివ నాగేశ్వరరావు యం.మహేష్ మీర్జా దినాయాత్ అలి ఎ.సతీష్ బి.వంశి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం భట్ల పెనుమర్రు గ్రామ శివారు మల్లికార్జున పురం లో ఈ వారంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన నడగల శ్రీనివాసరావు కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, బాపులపాడు మాజీ జెడ్పిటిసి, పామర్రు ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ మాతృమూర్తి కైలే జ్ఞానమణి శనివారం సాయంత్రం వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వం తరఫున పక్కా గృహ నిర్మాణం మంజూరుకుకొరకు చర్యలు చేపడతామని పేర్కొంటూ వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదే గ్రామంలో పెడసనగంటి శ్రీనివాసరావు వరిగడ్డి వాని కూడా పూర్తిగా కాలిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి కూడా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్టాఇందిర,ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, గ్రామ ఉపసర్పంచ్ చలసాని వెంకటరత్నం, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లికి 2,800 రోజులు

విశాలాంధ్ర-చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి సాధన కోసం శ్రమిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. స్వచ్ఛ చల్లపల్లి మహోద్యమం శనివారం నాటికి 2800 రోజులకు చేరుకోగా, ఈ సందర్భంగా జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయరహదారి 216 (బైపాస్) వెంబడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమంలో చల్లపల్లిలో వేలాది మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్న స్వచ్ఛ కార్యకర్తలు స్ఫూర్తిదాయకులన్నారు. స్వచ్ఛ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్న వైద్యదంపతులను, వారి అడుగులో అడుగులు వేస్తూ స్వచ్ఛత కోసం శ్రమిస్తున్న కార్యకర్తలను అభినందించారు. జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట విజయరాధిక, ఎంపీడీవో సిహెచ్. చినరాట్నాలు, కార్యదర్శి పివి. మాధవేంద్రరావు, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, స్వచ్ఛ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలకు నోటీసులు

విశాలాంధ్ర-చల్లపల్లి : నాగాయలంక మండలం భావదేవరపల్లిలో జరుగుతున్న మట్టి అక్రమ దందాకు వ్యతిరేఖంగా నాగాయలంక తహసీల్దార్ కార్యాలయ ముట్టడికి మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై టీడీపీ నేతలను ఆందోళనకు వెళ్లనీయకుండా ముందస్తుగా నోటీసులు అందించారు. చల్లపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, మాజీ డీసీ ఛైర్మన్ నిడమానూరి దిలీప్ కుమార్ తదితరులకు నోటీసులు అందచేశారు. అవనిగడ్డ వెళ్లిన నేతలు.. కార్యకర్తలు : మాజీ ఉపసభాపతికి మద్దతుగా టీడీపీ ఎంపీటీసీలు పైడిపాముల స్వప్న, రాజులపాటి అంకమ్మ, షేక్ నబీఘోరి, మాజీ వైస్ ఎంపీపీ బోలెం నాగమణి, టీఎన్టీయూసీ రాష్ట్ర నేతలు రావి చిట్టి, చంద్ర వెంకటేశ్వరరావు, పార్టీనేతలు, తెలుగుయువత పెద్దఎత్తున అవనిగడ్డ తరలివెళ్లారు.

జీఓ-117 వెంటనే రద్దు చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం : పాఠశాల వ్యవస్థని చిన్న భిన్నం చేస్తున్న జి ఓ ను వెంటనే రద్ద చేయాలని ఉపాధ్యాయుల సమాఖ్య సంఘము నాయకులు విద్యాసాగర్, నాగేంద్ర ,వరప్రసాద్ రాష్ట ప్రభుత్వాన్ని డిమెండ్ చేశారు.శనివారం రాష్ట శాఖ పిలుపు మేరకు గన్నవరం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య అద్వర్యం లో ఎస్ టి యు కార్యాలయంలో సమావేశం జరిగింది.ఈ సందర్భం విద్యాసాగర్ మాట్లాడుతూ రాష్ట వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున సమస్యలపై చర్చి చర్చి జరిగిందని, దీనిలో భాగంగా నియోజకవర్గా ఎమ్మెల్యేలకుప్రతినిద్యం భాగంగా ఎమ్మెల్యే డా వల్లభనేని వంశీ మోహన్ కు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట కౌన్సిల్ సభ్యులు విద్యాసాగర్, ఆనంద్,సజ్జనారావు, ఏ పిటీఫ్ సభ్యులు నాగేంద్ర యుటిఎఫ్ సభ్యులు రవిబాబు వరప్రసాద్ రాజబాబు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో అంగన్‌వాడి పిలుస్తోంది

విశాలాంధ్ర-పెదపారుపూడి : అంగనవాడి కేంద్రాలలో 3 నుండి 6 సంవత్సరముల లోపు చిన్నారులు అంగన్వాడి కేంద్రాలలో ఉండాలని మండల సూపర్వైజర్ ఎం. శివ నాగమణి శనివారం అన్నారు. మండలంలోని అప్పికట్ల గ్రామ అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్నారులకు కావలసిన ప్రీ స్కూల్ మెటీరియల్, సిలబస్ బుక్స్ అందుబాటులో ఉంటాయని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులకు తెలియజేయాలని సూపర్వైజర్ సిబ్బందికి సూచించారు.

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రి పై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వీ.శ్రీనివాస్, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవస్థానం అధికారులు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దుర్గమ్మకు నిత్యం సమర్పించే పంచ హారతులను హైకోర్టు న్యాయమూర్తులు కుటుంబ సభ్యులతో కలిసి తిలకించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

పోలీసు స్టేషన్ వద్ద టీడీపీ శ్రేణుల నిరసన

విశాలాంధ్ర-కోడూరు : నాగాయలంక మండల పరిధిలోని భావదేవరపల్లి గ్రామం నందు అక్రమ మట్టి త్రోలకాలని నిరశిస్తూ శనివారం నాగాయలంక మండల కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ పిలుపును ఇవ్వటంతో పోలీసులు అనుమతిలేదు ఆయను అదుపులోకి తీసుకుని కోడూరు పోలీసుస్టేషన్ తరలించారు. ఇది తెలుసు కున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు , మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో పోలీసు స్టేషన్ చేరుకున్నారు. పోలీసు స్టేషన్ వద్ద టీడీపీ శ్రేణులు నిరశన తెలిపారు. పోలీసు స్టేషన్ వద్ద పోలీసులకు టీడీపీ శ్రేణులు మధ్య వాగ్వివాధం చోటుచేసు కుంది. ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం పోలీసులు మండలి బుద్ధ ప్రసాద్‌ను అవనిగడ్డ తరలించారు వారి వెంట భారీగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, మహిళలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివెళ్ళారు.

బీజేపీ మతవిద్వేషాలపై అప్రమత్తం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దేశ ప్రజలందరికి అవసరమైన తిండి, గూడు, వైద్యం, ఉపాధి అందించ వలసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం లౌకిక రాజ్యాంగ వ్యవస్థకు త్రిలోదకాలు ఇచ్చి కేవలం మత విశ్వాసాలు రెచ్చగొట్టి అధికారమే లక్ష్యంగా ముందుకు సాగు తుందని ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని హై కోర్టు న్యాయవాది.జై భీమ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రవణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏపి హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నే వెంకట సుబ్బయ్య రచించిన చీకటి నుండి వెలుగులోకి పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రావణ్‌కుమార్, ఇతరులు పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం లౌకిక రాజ్యాంగ వ్యవస్థకు త్రిలోదకాలు ఇచ్చిందని, మత విశ్వాసాలు రెచ్చగొడితుందన్నారు. ఒకవైపు మతపరమైన జోక్యంతో సాగుతున్న పాకిస్తాన్ వంటి దేశాల్లో మహిళల పట్ల బాలల పట్ల వివక్షత ఉందని, కష్టపడే తత్వం ఉండదని అలాంటి నియంతృత్వ పాలన ఎవ్వరూ కోరుకోరన్నారు. డాక్టర్ సమరం మాట్లాడుతూ హేతువాద సాహిత్యం అధ్యయనం చేయాలని రాష్ట్రంలో నాస్తిక హేతువాద ఉద్యమం బలోపేతానికి వెంకట సుబ్బయ్య చేస్తున్న కృషికి అభినందనలు తెలిపారు. వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో స్వాములు బాబాలు పీఠాధిపతులు అందరూ రాజకీయ నాయకుల కనుసన్నల్లో ఉన్నారని వాళ్ళు రాజ్యాంగ అతీత శక్తులుగా ద్రోహులుగా ఉన్నారని వారికి బిజెపి పాలకులు అండగా ఉంటున్నారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఖచ్చితంగా ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి, ఎవరు ముఖ్యమంత్రి అవుతారో ముందుగానే చెప్పి అది నిజం అయితే వారిని నగర పుర వీధుల్లో ఏనుగు అంబారీ మీద ఊరేగిస్తాము అంటూ జ్యోతిష్యులకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో సాహితీ స్రవంతి కార్యదర్శి వర ప్రసాద్ ,హేతువాద సంఘం రాష్ట్ర నాయకులు మోతుకూరి అరుణకుమార్, ఎమ్.లక్ష్మీనారాయణ,కలేషా బెగ్,మాచర్ల, అరుణాచలం పాల్గొన్నారు.

'వెద'సాగుపై పెరుగుతున్న ఆసక్తి

విశాలాంధ్ర-కూచిపూడి : గ్రామాలలోవాతావరణ పరిస్థితులను బట్టి వరి సాగును వెద పద్ధతి ద్వారా నిర్వహించుకోవడంలో రైతులు నిమగ్నమైనారు. మృగశిర కార్తి ప్రవేశించి దరిద్రాపు పది రోజులు అవుతున్నా చినుకు పడే పరిస్థితులు కనుచూపుమేర కనపడకపోవడంతో మొవ్వ మండలంలోని పలు గ్రామాలలో రైతులు 'వెద' పద్ధతిపై వరి సాగు చేసుకోవడంలోదృష్టిసారించారు. మండలంలోని అయ్యంకి గ్రామంలో ఈ సాగుకు శ్రీకారం చుట్టారు. దీనికి ఎకరానికి రూ. 2000 నుంచి రూ. 2500 వరకు ఖర్చు అవ్వడంతో 150 రోజుల పంటలైన ఎం టి యు 10 61, ఎం టి యు 1318 రకాలు సాగు చేస్తున్నారు.వేసవి దుక్కుల అనంతరం రోటవేటర్తో తిరగ తీయించి వెద మిషను ద్వారా విత్తనాలను పొలాలలో జల్లు కొంటున్నారు. అదేవిధంగా సాగునీరు వెళ్లడానికి వీలుగా యాంత్రికరణ ద్వారా బాటలు కూడా తీస్తున్నారు. ఎండలను, వడగాడ్పులను సైతం లెక్కచేయకుండా రైతులుఎకరానికి 15 కిలోల నుంచి 23 కిలోల లోపుగా వరి విత్తనాలను సాగు చేస్తున్నారు. పొలంలో అవసరమైనమేరకు విత్తనాలను చల్లి విద్యుత్ మోటార్లు, ఆయిల్ ఇంజన్ ద్వారా పొలాలకు సాగునీరు సరఫరా చేసుకొంటున్నారు. విత్తనాలు చల్లిన తర్వాత నీటితో తడిపే ముందుగా స్టాంప్ కలుపు మందును కూడా ముందు జాగ్రత్తగా చర్యగా స్ప్రే అలాగే విత్తనాలు జరిగిన 15 రోజుల తర్వాత కూడా కలుపు నిర్మూలన మందిరం జల్లుకోవడానికి రైతులు సిద్ధంగాఉన్నారు. కూలీల డిమాండును తగ్గించుకోవడానికి వీలుగా ముందస్తుగానే యాంత్రికరణ ద్వారా వెద పద్ధతిన వరి సాగు ప్రారంభించారు. అయ్యంకిలో ఇప్పటికి 250 ఎకరాల లోపు సాగు చేశారని గ్రామ వ్యవసాయ సహాయకులు కే రాజేష్, అలాగే భట్లపెనుమర్రులో 60 ఎకరాలు సాగుచేసినట్లు వీఏఏ ప్రత్యూష, పెదసనగల్లులో 50 ఎకరాలు సాగు చేసినట్లు జె. నృపేన్.చక్రవర్తి, మొవ్వ-1 లో 85 ఎకరాలు సాగు చేసినట్లు వి ఏ ఏ నాగరాజు, మొవ్వ-2 లో 55 ఎకరాలువెద సాగు జరిగిందని వి ఏ ఏ కవితవెల్లడించారు. వెద పద్ధతిన సాగు ద్వారా 10 రోజులు ముందుగానే (140 రోజులు) పంట చేతికి అందే అవకాశాలు ఉంటాయని పలువు రైతులు వెల్లడిస్తున్నారు. ఈ సాగులో కలుపు ఇబ్బందులు అధికంగా ఉంటాయని అందుకునే ముందు జాగ్రత్తగా కలుపు మందు కూడా జల్లుతున్నామని సాగు చేసే రైతులు వెల్లడి చేశారు. విత్తనాలు కిలోకు ఐదు రూపాయల సబ్సిడీపై వ్యవసాయ శాఖ, ఏ విధమైన సబ్సిడీ లేకుండా ప్రవేట్ డీలర్లు సరఫరా చేస్తున్నారు.

సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం వెంటనే జమ చేయాలి

బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ వెంకట సుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్) : సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం వెంటనే జమ చేయాలని బిల్డింగ్ & కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్ వెంకట సుబ్బయ్య డిమాండ్ చేశారు. విజయవాడ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం చిట్టినగర్ సెంటర్‌లో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి అందులో కార్మికులకు ఉపయోగపడాల్సిన సొమ్మును ఈ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, మూడు సంవత్సరాల కాలంలో నిర్మాణ సామాగ్రి ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు పనులు లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలీ సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలోని 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి నిర్మాణ కార్మికుల జీవితాలను నాశనం చేసిందని, కార్మికుల పేరు చెప్పి అధికారంలోకి వచ్చి వారి స్వార్థం కోసం కార్మిక వ్యవస్థనే లేకుండా చేయాలని చూస్తూ ఉన్నారన్నారు. యూనియన్ డిప్యూటీ కార్యదర్శి చేల్ల వెంకటరమణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్రంలో తిరిగి ప్రారంభించాలని కోరుతూ ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు ధర్నా చౌక్‌లో భవన నిర్మాణ కార్మికుల ధర్నా కార్యక్రమం చేస్తున్నారని, నగరంలోని కార్మికులందరూ ఆ ధర్నాకు హాజరై జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీర్ల రామస్వామి, రెడపొంగు ప్రభుదాసు, తమ్మిన బాలయ్య పాల్గొన్నారు.

19 వరకు రేషన్ సరుకులు పంపిణీ

జేసీ డాక్టర్ సంపత్‌కుమార్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలోని రేషన్ కార్డు దారులందరికీ జూన్ నెల ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు సరఫరాను ఈనెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రేషన్ కార్డు దారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. చౌకధరల దూకాణ డీలర్లు, ఎండీయు ఆపరేటర్లు 19వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయాలని ఈ ప్రకటనలో తెలిపారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

సమన్వయలోపం-నిర్వహణలో డొల్లతనం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయలోపం, ప్రభుత్వ పథకాల అమలులో డొల్లతనం సాక్షాత్తు ఉన్నతాధికారుల ముందే బయటపడిన సంఘటన విస్సన్నపేటలో వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే...రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ విస్సన్నపేట మండలంలో ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరును విచారించేందుకు శుక్రవారం సాయంత్రం ఇక్కడికి చేరుకున్నారు. ఇక్కడి తన పర్యటన రాత్రి వరకు కొనసాగించారు. ఈ సందర్భంగా తొలుత స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో డిజిటల్ తరగతుల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న పథకాల అమలుపై హెచ్ఎం పజ్జూరి రమేష్‌ను విచారించారు. ఈ సందర్భంగా ఈ పాఠశాల ఉన్న ప్రాంతంలో విద్యాలయాల పర్యవేక్షణ బాధ్యత చూసే గ్రామ సచివాలయ ఉద్యోగిని పిలిచి, మండల విద్యాశాఖాధికారి పేరు ఏంటని ప్రశ్నించగా, తనకు తెలియదంటూ సమాధానం ఇచ్చారు. ఇదే క్రమంలో సంబంధిత అధికారి రామకృష్ణను చూపి, అతని గురించి వివరాలు అడిగే ప్రయత్నం చేసినా, సదరు ఉద్యోగి నుంచి మౌనమే సమాధానంగా వచ్చింది. ఈ ఘటన అధికారులు, ఉద్యోగుల మధ్య సమన్వయలోపాన్ని స్పష్టం చేస్తోందని ప్రవీణ్ ప్రకాష్ వ్యాఖ్యానించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ జగనన్న విద్యాదీవెన కిట్లు అందించి, ఫోటోలు దిగాలని కోరారు. ఈనెల 12వ తేదీ నాటికి విద్యార్థులందరికీ వీటిని అందజేయాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండగా, తాజాగా తాను అందించటమేంటీ, ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేకపోయారంటూ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్సన్నపేట పంచాయతీ పరిధిలోని కోలేటి ఎస్సీవాడ పాఠశాలను పరిశీలించగా, విద్యార్థుల దుస్తులు కుట్టించుకునేందుకు ప్రభుత్వం ఇస్తున్న సొమ్ములు చాలటంలేదని కొందరు గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. తాను విచారించి, ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చిన ఆయన అనంతరం స్థానికంగా ఉన్న ఒక టైలరింగ్ దుకాణానికి వెళ్లి, విద్యార్థుల దుస్తులు సిద్ధం చేసేందుకు ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే విషయాలను విచారించారు. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయన పర్యటన కారణంగా రాత్రి పొద్దుపోయేవరకు విద్యాలయాల్లో ఎదురుచూశారు. మరోవైపు ఇప్పటివరకు మండలంలో అసలు తెరుచుకోని, మౌలిక సదుపాయాల కొరతతో అలరారుతున్న గిరిజన సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాల గురించి ప్రవీణ్‌ప్రకాష్ కనీసం విచారించకపోవటం విశేషం.

'జగనన్న సురక్ష'కి సర్వం సిద్ధం : కలెక్టర్ ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఈ నెల 23వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారుల బృందాన్ని సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్ర నిర్వాహణపై ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ముత్యాలరాజు శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సుకు స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమానికి అధికారులతో కూడిన బృందాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 605 సచివాలయాల్లో 305 అర్బన్ పరిధిలో, 275 రూరల్ పరిధిలో ఉన్నాయన్నారు. నగరంలో ఉన్న 286 సచివాలయాసలు ఆరు బృందాలుగా విభజించి రోజుగు 4 సచివాలయాల పరిధిలో అన్ని గృహాలను 12 రోజుల్లో ఇంటింటికి వెళ్ళి అర్హతగల ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించటం, ఇతర సమస్యలు ఇంటే వివరాలు నమోదు చేయటం జరుగుతుందన్నారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ సిబ్బంది ఒక బృందంగా, జోనల్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్ సిబ్బంది 2వ బృందంగా ఏర్పడి వార్డుల్లో పర్యటిస్తారన్నారు. సమస్యలున్నవారిని సచివాలయాలకు వద్దకు ఆహ్వానించి వారి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ డాక్టర్ సంపత్‌కుమార్; గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి కే.అనూరాధ పాల్గొన్నారు.

సాకారమైన 'పేట' హైవే బస్టాండ్ నిర్మాణం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : జాతీయ రహదారిపై బస్టాండ్ నిర్మాణం చేపట్టాలన్న జగ్గయ్యపేట పట్టణవాసుల కల ఎట్టకేలకు నెరవేరిందని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. అందుకోసం కోటి రూపాయల వ్యయంతో ఆరు నెలల వ్యవధిలో బస్టాండ్ నిర్మాణం శరవేగంగా జరగనున్నదని తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నేషనల్ హైవే పై ఉన్న ఫుడ్ ప్లాజా వెనుక ఏపీఐఐసీ స్థలంలో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న హైవే బస్టాండ్ కు రాష్ట్ర ప్రభుత్వవిప్,శాసనసభ్యులు సామినేని ఉదయభాను ,ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ ద్వారకా తిరుమల రావు ,జోనల్ చైర్ పర్సన్ తాతినేని పద్మ ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె డి సి సి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,హాఫిజున్నిసా, కౌన్సిలర్ గింజుపల్లి వెంకటరామయ్య,పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు,దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి,మార్కెట్ యార్డ్ చైర్మన్ ముత్తినేని విజయ శేఖర్,కటారి హరిబాబు, జడ్పిటీసిలు,సీనియర్ నాయకులు,జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై దానం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్ తదితర అధికారులు,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ అంబేద్కర్ ట్రోఫీ క్రికెట్ టోర్నీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు, ఒత్తిడిని అధిగమించి నిలబెట్టేలా చేస్తాయని ఎస్సీ కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ చెప్పారు. నిత్యం పని ఒత్తిడితో బిజీగా ఉండే వారికి.. ఇటువంటి క్రీడలు ఎంతో మనసిక ఉల్లాసాన్ని ఇస్తాయని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. యన్టీఆర్ జిల్లా ఇబ్రహీం పట్నం సమీపంలోని మూలపాడు ఎసీఎ ఇంటర్నెషనల్ క్రికెట్ స్టేడియంలో డాక్టర్ అంబేడ్కర్ ట్రోఫీ పేరుతో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ టోర్నీ ప్రారంభోత్సవానికి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎసీపీ రవికిరణ్, కోలా ప్రసాద్, దాసరి సువర్ణరాజు, కోకా రమేష్ లు అతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ బ్యాటింగ్ చేయగా, ఎసీపీ రవికిరణ్ కాసేపు బౌలింగ్ చేశారు. ఆ తర్వాత కలెక్టర్ బౌలింగ్ వచ్చిన సమయంలో ఎసీపీ బ్యాటింగ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రెవిన్యూ, పోలీసు, మున్సిపల్ కార్పోరేషన్, ఎస్సీ కార్పోరేషన్, డాక్టర్స్, మీడియా టీంలు ఈ టోర్నీలు తలబపడుతున్నాయని తెలిపారు. ఎసీపీ రవికిరణ్ మాట్లాడుతూ సువర్ణరాజు ఆధ్వర్యంలో బి.ఆర్. అంబేడ్కర్ ట్రోఫీ సీజన్ ఒన్ హైదరాబాద్ లో నిర్వహించారని, సీజన్ టూ ఇక్కడ మూలపాడులో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మీడియా, పోలీసు టీం ల మ్యాచ్ ను ప్రారంభించిన ఎస్సీ కమీషనర్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ టోర్న మెంట్ లో పోటీ పడుతున్న ఆరు టీంలు ఆరు రంగాలలో బిజీ బిజీగా ఉంటారని, వారంతా సమయం కేటాయించి క్రీడల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. క్రికెట్ టోర్నీలో పోలీసు మీడియా టీం కు కలెక్టర్ టాస్ వేయగా, ఎస్సీ కమీషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్, ఇరు జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందనలు తెలిపారు. కలెక్టర్ కుచెందిన రెవిన్యూ, కార్పోరేషన్ మ్యాచ్ కు ఎసీపీ రవికిరణ్ టాస్ వేశారు. ఇక రెండు గ్రౌండ్స్ లో జరిగిన మ్యాచ్ లలో ఒకటి ఏకపక్షంగా జరగ్గా, రెండోది మాత్రం విజయం చివరి వరకు ఇరు జట్ల మధ్య దోబూచులాట ఆడింది. బి గ్రౌండ్ లో మీడియా జట్టుపై పోలీసు టీం ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన పోలీసు టీం నిర్ణీత 20ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 184 పరుగులు చేసింది. ఈ రెండు టీం ల మధ్య విజయం దోబూచులాడినా.. ఉత్కంఠ రేపినా.. చివరికి రెవిన్యూ టీం గట్టెక్కింది.

నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువు తవ్వకాలు

అడ్డుకున్న రెవెన్యూ, పోలీసు యంత్రాంగం

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : మండల పరిధిలోని కుదప రెవెన్యూ పరిధిలోని ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపల చెరువు తవ్వకాలు సాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే రెడ్డిగూడెం మండలం కుదప గ్రామ రెవెన్యూ పరిధిలోని ఓబులాపురం గ్రామం నాగసానిపాటి వారి చెరువుకు వెళ్లే సప్లై చానల్‌ను అనుకొని ఉన్న సర్వే నంబర్ 449/1లో ఉయ్యూరు అంజిరెడ్డికి చెందిన సుమారు 9.41 ఎకరాల వరి మాగాణి భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా చేపల చెరువు త్రవ్వకాలు సాగుతున్నాయి. ఈ చేపల చెరువు తవ్వడంతో ఓబులాపురం నాగసాని పాటి చెరువుకు నీళ్ళు వెళ్లడం ప్రశ్నార్థకంగా మారుతుంది. భవిష్యత్తులో చెరువు కింద అయకట్టు వరి పొలాలకు నీటి ఎద్దడి వచ్చి పంటలు నష్టపోయే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో పంచాయతీలు అనుమతి మంజూరు చేయలేదు. ఈ సర్వే నంబర్‌లో చేపల చెరువు తవ్వకాలు చేయకూడదని పలుమార్లు అధికారులు సూచించారు. గతంలో ఈ ప్రాంతంలో అనుమతి లేకుండా చేపల చెరువు తవ్వుతుంటే రెవెన్యూ అధికారులు అడ్డుకుని హెచ్చరించారు. దీంతో తాత్కాలికంగా చెరువుతవ్వకాలు ఆపివేశారు. కానీ రెవెన్యూ అధికారులు హెచ్చరికలను సైతం లేక్క చేయకుండా గత నాలుగు రోజుల నుంచి రాత్రివేళల్లో పొక్లెయిన్‌లతో తవ్వకాలు సాగుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం వెళ్లి అడ్డుకుని చేపల చెరువు తవ్వకాలు అడ్డుకుని పొక్లెయిన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అనుమతులు లేకుండా చెరువులు తవ్వితే కఠిన చర్యలు

మండలంలో చేపల చెరువుల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా సరే అనుమతులు లేకుండా అక్రమంగా చేపల చెరువు తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

-ఎం.పాల్, తహశీల్దార్

నేడు మంగాయమ్మ సంస్మరణ సభ

విశాలాంధ్ర-విజయవాడ : శనివారం మృతి చెందిన మహిళా సమాఖ్య నాయకులు దేవ మంగాయమ్మ సంసర్మరణ సభ ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని ఆమె కుటుంబ సభ్యులు డాక్టర్ డి.సుజాత, డాక్టర్ వి.సదానందం, డాక్టర్ వెన్నెల, డాక్టర్ విజ్ఞేష్, డి. రాజేంద్ర ప్రసాద్, డి.రాధకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నక్కల రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా ఉన్న వెన్నెల స్కానింగ్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీటీసీ విషయంలో ప్రోటోకాల్ పాటించడం లేదు

విశాలాంధ్ర-కంచికచర్ల: ప్రజా సమస్యల మీద రాజీలేని పోరాటం చేస్తున్న తనను అధికారక కార్యక్రమాలకు పిలవకుండా, ప్రోటోకాల్ పట్టించకుండా మండలం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారని కంచికచర్ల ఆరో సెగ్మెంట్ ఎంపీటీసీ, బిఎస్పీ నాయకులు బర్రె ఉదయ్ కిరణ్ ఆరోపించారు. కంచికచర్ల మండల పరిషత్ నిధులు ద్వారా కంచికచర్ల గ్రామంలో 6వ సిగ్మెంట్ లో గ్యాస్ కంపెనీ నుండి ఎన్టీఆర్ కాలేజీ మీదగా వెళ్ళడానికి సి సి రోడ్డు ఏర్పాటుకు ఎమ్మెల్యే, స్థానిక ప్రజా ప్రతినిధులు మండల అధికారులతో కలిసి శనివారం శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీగా ప్రాతినిధ్యం వహిస్తున్న తనను ఆహ్వానించకపోవడం శోచనీయమని, విషయాన్ని కలెక్టర్ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రానున్న మండల సమావేశంలో సమస్యను ప్రశ్నిస్తానని ఆయన తెలిపారు.

క్రీడాపాఠశాల ప్రవేశానికి ఎంపికలు

విశాలాంధ్ర-తిరువూరు: కడపలోని డాక్టర్ వైయస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశం పొందగోరు విద్యార్థులకు మండల స్థాయిలో ఎంపిక నిర్వహిస్తున్నట్లు తిరువూరు ఇన్చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. 4, 5 తరగతులు చదివే బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశానికి అర్హులని, ఈనెల 19న ఉదయం 9 గంటలకు తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగే ఎంపిక ప్రక్రియకు తాము చదివే పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకొని హాజరుకావాలని కోరారు. స్కిల్ టెస్ట్ నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 94 94 75 85 70 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా వార్డ్, నగర అభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : అనేక రంగాల్లో అభివృద్ధి సాధించిన నగరం మరింత అభివృద్ధి చెందేలా ప్రతి కార్పొరేటర్ ఒక బ్రాండ్ అంబాసిడర్‌కు తమ వార్డు, నగరాభివృద్ధికి కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. విజ్ఞాన యాత్రకు వెళ్ళి తిరిగిం వచ్చిన ఈశాన్య రాష్ట్రాల కార్పొరేటర్ల బృందం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శనివారం అక్కడి అనుభవాలు మీడియాతో పంచుకున్నారు. మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కార్పొరేటర్లు విజ్ఞాన యాత్రకు వెళ్ళి ఇతర రాష్ట్రాల్లోని నగరాల అభివృద్ధిని పరిశీలించారని, ఆయా నగరాల అభివృద్ధి కంటే మన నగరం అనేక రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు గుర్తించినట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా మీరు నగరంలో జరుగుతున్న అభివృద్ధితో పాటు వివిధ రాష్ట్రాలు, నగరాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ సంస్కరణలు, ప్రాజెక్టులను అధ్యయనం చేయటం ద్వారా మీరు ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా మీ వార్డ్, నగర అభివృద్ధికి మీరు కృషి చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ కార్పోరేటర్ల విజ్ఞాన యాత్ర విజయవంతముగా ముగిసిన వివిధ నగరాలలో జరుగుతున్న అభివృద్ధిని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు అవకాశం కల్పిస్తూ అన్ని విదాలుగా సహాయ సహకారాలు అందించిన మేయర్, కమిషనర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా వారిని శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిచంద్, అసిస్టెంట్ ఇంజనీర్ కే.యేసుపాదం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాల ప్రోత్సాహకాలు పంపిణీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న అణీముత్యాల ప్రోత్సాహకాలను విద్యార్థులకు జడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జగనన్న ప్రభుత్వంలో నాడు-నేడుతో పాఠశాలల భవనాల అభివృద్ధితో పాటు అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక, వసతి దీవెన ఇలా ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులైన నక్కనబోయిన గోపాలకృష్ణ, పడిసల సిసింద్రీ, అల్లూరి తిరుపతిరెడ్డిలకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాది రాణీ, ఎంపీటీసీ సభ్యులు కుప్పిరెడ్డి వర ప్రసాద్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఉయ్యూరు భరత్‌కుమార్‌రెడ్డి, బత్తుల శ్రీనివాసరెడిడ్డి, ఎంఈఓ పి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రోడ్ల నిర్మాణానికిశంకుస్థాపన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : స్థానిక 17వ వార్డులోని పెద్దరామాలయం పరిసర ప్రాంతాలలో సుమారు రూ.5.22 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనుల శంఖుస్థాపన కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారు. అదేవిధంగా చెరువు బజార్ నందు నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో పట్టణంలో పలు అభివృద్ధి పనులను చేపట్టడానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ రావు,వైఎస్సార్సీపీ నాయకులు పఠాన్ ఫిరోజ్ ఖాన్,తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ,మున్సిపల్ కమిషనర్ నాగ మల్లేశ్వర రావు, డీ ఈ శివ కోటేశ్వరరావు, ఏ ఈ హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు టూరిజం రంగంలో అవకాశాలు అపారం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దేశంలోని టూరిజం రంగంలో రోజురోజుకు పెరుగుతున్న ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఇనిస్టూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్(ఐ.ఐ.టి.టి.ఎం) దక్షిణ భారత దేశంలో ఉన్న ఎకైక ఇనిస్టూట్ నెల్లూరులో ఉందని దాని ద్వారా ప్రవేశాల కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నరహరి నరేష్,అకౌంట్స్ అసిస్టెంట్ సుధా మీరత్ తెలిపారు.శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ ఇనిస్టూట్‌లో టూరిజం, ట్రావెల్ మేనేజ్మెంట్ ప్రధాన అంశాలుగా ఎంబీఏ, బి బి ఏ కోర్సులలో శిక్షణ పొందేందుకు ఈ నెల 23 లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.అల్పాదాయ వర్గాల వారికి పూర్తిస్థాయిలో ఫీజు రియంబర్స్‌మెంట్ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ఏపి విద్యార్థులకు స్కాలర్‌షిప్/ఫి రీయింబర్సుమెంట్ సౌకర్యం కలదు అన్నారు. ఇతర వివరాలకు www.iitttmsouth. org, nellore@iittm.ac.in 9966462786,9490787854 నంబర్‌లకు ఫోన్ చేయవచ్చు అన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల: పట్టణంలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షల అంచనా వ్యయంతో గ్యాస్ కంపెనీ వద్ద నుండి అంబేద్కర్ కాలనీ వరకు నూతనంగా నిర్మించనున్న సి సి రోడ్డు నిర్మాణ పనులకు శాసన సభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు శనివారం శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మరమత్తు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహన్ రావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, ఎంపీపీ మలక్ బషీర్, జడ్పిటిసి వేల్పుల ప్రశాంతి, ఎంపిడిఓ బాలశంకర్, ఎంపీటీసీ నన్నపనేని నరసింహారావు, ఇన్చార్జి సెక్రటరీ ఖాదర్ వలీ, ఓర్సు నరసింహారావు, చింతా రవీంద్ర, మార్త శ్రీనివాస్,, స్థానిక వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

82 రోజుల తిరుపతమ్మ హుండీల ఆదాయం రూ.1.40 కోట్లు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో శనివారం హుండీ లెక్కింపు నిర్వహించారు. 82 రోజులకు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం సాధన ఖాతా ద్వారా రూ. 1,28,35,328, తిరుపతమ్మ అమ్మవారి నిత్య అన్నదానం ట్రస్టు ద్వారా రూ. 11,80,260, మొత్తం రూ. 1,40,15,588, రాగా, మిశ్రమ బంగారం 118 గ్రాములు, మిశ్రమ వెండి 230 గ్రాములు వచ్చినట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి రమేష్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్ ఇంజం కేశవరావు, పాలక మండలి సభ్యులు, దేవస్థాన సిబ్బంది, అమ్మవారి ఆలయ పూజారులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్ నుంచి విద్యార్థినికి పురస్కారం

విశాలాంధ్ర-తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఆదూరి స్వప్న ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జగనన్న ఆణిముత్యాలు జిల్లా స్థాయి పురస్కారాన్ని శనివారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీ రావు, మాజీ మంత్రి బెల్లంపల్లి శ్రీనివాసరావు చేతుల మీదుగా స్వప్న రూ. 50 వేలు నగదు, ప్రశంసా పత్రం, అవార్డు అందుకున్నట్లు తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బు మురళీకృష్ణ తెలిపారు.

సీఎంతో విజయసాయిరెడ్డికి ప్రాణహాని : బుద్ధా వెంకన్న

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్) : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో ఎంపి విజయ సాయిరెడ్డికి ప్రాణహాని వుందని ఉత్తరాంధ్ర ప్రాంత టీడీపీ ఇంచార్జి బుద్ధా వెంకన్న అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం లోక్ సభ సభ్యుడి కుటుంబసభ్యుల కిడ్నాప్ జరిగిందని, దానికి కొనసాగింపుగా త్వరలోనే రాజ్యసభసభ్యుడి విజయసాయిరెడ్డి కిడ్నాప్ జరుగుతుందన్నారు. జగన్ నుంచి విజయసాయిరెడ్డికి, అతని కుటుంబ సభ్యులకు ప్రాణ హాని ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సాదరబోయిన ఏడుకొండలు, గుర్రంకొండ, పత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చదువులో పోటీతత్వం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-తిరువూరు: విద్యార్థులు చదువులో పోటీపడి చదివి అత్యధిక మార్కులు సాధించాలని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి అన్నారు. మండలంలోని మునుకుళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణిముత్యాలు పథకం కింద ఎంపికైన పదో తరగతి విద్యార్థులు పోతగాని శరణ్య, యరమల దివ్యశ్రీ రెడ్డి, ముత్యాల రేణుకలకు ప్రభుత్వం ప్రకటించిన పతకాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునుకుళ్ళ పిఎసిఎస్ చైర్మన్ వెదురు గోపిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు నగదు బహూకరణ

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నదే ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని గ్రామ వైసిపి నాయకులు కర్రీ రవీంద్ర అన్నారు. శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా అనాసాగరంలో జడ్పీపీహెచ్ఎస్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ స్కూల్ ప్రిన్సిపల్ తో కలిపి ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులు అయ్యి ప్రథమ స్థానంలో నిలిచిన నల్లపు చరణ్ తేజ ద్వితీయ స్థానం పొందిన నల్లపు ఆదిలక్ష్మి తృతీయ స్థానం పొందిన పోలా గోపిశ్రీనివాస్ బంగారు రజిత కాంస్య పతకాలతో పాటు నగదు బహుమతులను వారు అందజేశారు ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాకాల పాటి కిరణ్ కుమార్, యూపీహెచ్సీ చైర్మన్ రవీంద్రబాబు, పెద్దలు చాపల మల్లికార్జున రావు, పేరెంట్ కమిటీ చైర్మన్ కృష్ణవేణి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.